ఆటో కార్మికుల నిరసన

నల్లగొండలో ఆందోళన చేస్తున్న ఆటో కార్మికులు

మిర్యాలగూడ, ఫిబ్రవరి 16: ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు పథకం వల్ల ఆటో డ్రైవర్లు, యజమానులు రోడ్డున పడ్డారని వారికి ప్రభుత్వం చేయూతనందించి సమస్యలు పరిష్కరించాలని బీఆర్ఎస్ అనుబంధ ఆటో యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నాజర్‌అలీమీర్జా, జిల్లా కార్యదర్శి మహమ్మద్ పర్వేజ్ డిమాండ్ చేశారు. మిర్యాలగూడ పట్టణంలో శుక్రవారం ఆటో యూనియన్ ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్లు వేసి గెలిపించిన పాపానికి ఆటో డ్రైవర్లు చనిపోయే పరిస్థితి దాపురించిందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు యాదగిరి, కొండల్, మహమూద్ త ఉన్నారు.

నల్లగొండ రూరల్ : రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన ఆటోల బంద్‌లో భాగంగా నల్లగొండ నియోజకర్గం వ్యాప్తంగా ఆటోలు బంద్ నిర్వహించినట్లు తెలంగాణ ఆటో ట్రేడ్ యూనియన్ నల్లగొండ అసెంబ్లీ కన్వీనర్ యాదగిరి గౌడ్ తెలిపారు. ఆటో యూనియన్ల ఆధ్వర్యంలో బంద్ నిర్వహించి గడియారం సెంటర్‌లో నిర్వహించిన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత బస్సు సర్వీసులతో ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోయి, ప్రాణాలు తీసుకుంటున్న ప్రభుత్వం నేటికి పట్టించుకోక పోవడం దారుణమన్నారు.

ప్రభుత్వం స్పందించకపోతే సమ్మె ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

- తిప్పర్తి : మండల కేంద్రంలో ఆటో డ్రైవర్లు ప్రధాన రహదారిపై నిరసన తెలుపుతూ అనంతరం ఆటో ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు తిమోతి, నబీ,నజీర్, ఖమ్రుద్దీన్ ,నల్ల శ్రీను, శ్రీను పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులపై ఎంపీడీఓలు దృష్టి సారించాలి

- కలెక్టర్ హరిచందన

నల్లగొండలో ఎంపీడీఓల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

నల్లగొండ, ఫిబ్రవరి 16 : గ్రామాల్లో అభివృద్ధి పనులపై ఎంపీడీఓలు దృష్టి సారించాలని కలెక్టర్ హరిచందన సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన ఎంపీడీఓల సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎంపీడీఓ గ్రామీణ తాగునీటి సరఫరా పనులపై దృష్టి సారించాలన్నారు. ప్రధానంగా పరిశుభ్రతపై దృష్టి సారించాలని, వేసవి దృష్ట్యా ఎక్కడ మొక్కలు ఎండిపోకుండా చూడాలని, ఉపాధి హామీ పథకం కింద మెటీరియల్ కాంపోనెంట్ పనులపై దృష్టి సారించాలని, సాధ్యమైనంత ఎక్కువగా పనులు గుర్తించాలని ఆదేశించారు. ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకం కింద ఆయా మండలాల వారీగా చేతి వృత్తుల వారిని గుర్తించి లక్ష్యాన్ని నిర్దేశించాలని తెలిపారు. అంగన్‌వాడి కేంద్రాల మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం మిచ్చి నూటికి నూరు శాతం వీటిని పూర్తి చేయాలన్నారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాల పూర్తిపై దృష్టిసారించాలన్నారు. మంజూరు ఇచ్చిన సీసీ రోడ్లన్నింటిని వెంటనే పూర్తిచేసేలా చూడాలన్నారు. అంతకుముందు అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ , ఆయా అంశాల వారీగా ఎంపీడీఓలతో సమీక్షిస్తూ పనుల పూర్తికి సమయాన్ని నిర్దేశించారు. సమావేశానికి జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ కోటేశ్వరరావు, జడ్పీ సీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, డీఎంహెచ్ఓ కొండల్‌రావు, ఎల్డీఎం శ్రామిక్ పాల్గొన్నారు.

ఓటును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

ప్రతి ఒక్కరూ ఓటును సద్వినియోగం చేసుకొని సరైన నాయకుడిని ఎన్నుకోవాలని కలెక్టర్ హరిచందన దాసరి కళాశాల విద్యార్థులకు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని నాగార్జున ప్రభుత్వ కళాశాలలో ఎన్నికలపై నిర్వహించిన స్వీప్ అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం విద్యార్థులతో ఓటు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జడ్పీ సీఈఓ ప్రేమ్ కిరణ్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ ఉపేందర్, స్వీప్ నోడల్ అధికారి అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

యాదాద్రి పవర్‌ప్లాంట్ పరిశీలన

దామరచర్ల : యాదాద్రి పవర్‌ప్లాంటు పనులను కలెక్టర్ హరిచందన శుక్రవారం పరిశీలించారు. ప్లాంటులోని టీఎస్ జెన్‌కో, బీహెచ్ఈఎల్ అధికార్లతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేసి ప్లాంటు పనుల ప్రగతి గురించి అడిగి తెలుసుకున్నారు. దీనితో పాటుగా ఈనెల 20న ప్లాంటు వద్ద నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణ ఏర్పాట్లను పరిశీలించారు. ప్లాంటు ఏర్పాటుకు తొలుతగా అన్ని అనుమతులు వచ్చినప్పటికీ ఇటీవల రెండు స్వచ్ఛంద సంస్థలు ఎంజీటీలో కేసులు వేయడంతో కేంద్ర పర్యావరణ శాఖ తిరిగి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలని ఆదేశించిందని, ఈనెల 20న జిల్లా పర్యావరణ శాఖ అధికారులు గ్రామసభకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఏర్పాట్లపై స్థానిక అధికారులతో చర్చించి గ్రామ సభ ఎలాంటి అవాంతరాలు లేకుండా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ శ్రీనివాస్, ఆర్డీఏ చెన్నయ్య డీఎస్పీ రాజశేఖర్‌రాజు, తాసీల్దార్ శంకర్‌నాయక్, ఆర్ఐ సతీశ్ ఉన్నారు.

మండలి చైర్మన్ గుత్తా పరామర్శ

తిప్పర్తి : మర్రిగూడలో జనార్దన్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

తిప్పర్తి, ఫిబ్రవరి 16: మండలంలోని మర్రిగూడ గ్రామానికి చెందిన కంచర్ల జనార్దన్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి వేర్వేరుగా శుక్రవారం మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. జడ్పీటీసీ పాశం రాంరెడ్డి, మాజీ జడ్పీటీసీ తండు సైదులు గౌడ్, మండడి సైదిరెడ్డి, తండు నర్సింహ గౌడ్ ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పరామర్శ

అంజయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

మాడ్గులపల్లి, ఫిబ్రవరి 16: మండలంలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సింగం శివ చిన్నాయన సింగం అంజయ్య ఇటీవల మృతిచెందారు. నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి శుక్రవారం ఆయన కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. త్వరలోనే పార్టీ బీమా రూ.2 లక్షలను అందజేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట తిప్పర్తి మాజీ జడ్పీటీసీ తండు సైదులుగౌడ్, నాయకులు లొడంగి గోవర్ధన్, కందుల లక్ష్మయ్య, కందిమళ్ల నరేందర్‌రెడ్డి, వనపర్తి నాగేశ్వర్‌రావు, సందినేని జనార్దన్‌రావు, తండు నర్సింహ, శ్రీను, గడ్డం ప్రభాకర్‌రెడ్డి, గడ్డం శంకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మాధవీవెంకట్‌రెడ్డి, సైదిరెడ్డి, ఏడుకొండలు ఉన్నారు.

వైభవంగా కంఠమహేశ్వర స్వామి బోనాలు

మర్రిగూడ : వట్టిపల్లిలో బోనాలతో వెళ్తున్న గ్రామస్తులు

మర్రిగూడ, ఫిబ్రవరి 16 :మండలంలోని వట్టిపల్లిలో గౌడ కులస్తుల ఆరాధ్య దైవం కంఠమహేశ్వర స్వామి బోనాల పండుగ గౌడ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వైభవంగా జరుపుకున్నారు. మహిళలు డప్పు వాయిద్యాలు, శివసత్తుల నృత్యాల మధ్య ఊరేగింపుగా వెళ్లారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

జోగ్ ఉత్సవాలు ప్రారంభం

జోగ్ ఉత్సవాల్లో పాల్గొన్న గిరిజన భక్తులు

చందంపేట, ఫిబ్రవరి 16 : గోపాలస్వామి (గరునానక్) జోగ్ ఉత్సవాలు శుక్రవారం సాగర్ పరిధిలోని చింతలతండాలో కేతావత్ సర్దార్ పూల్‌సింగ్ బావోజి ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. చింతలతండా నుంచి ఉత్సవాలు ప్రారంభం కాగా మధునాయక్ వారసులకు సంబంధించి గురునానక్ ఆలయంలో తొలి పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ తిరిగి కానుకలు సమర్పించారు. ఇందులో భాగంగా ప్రభాత్(పేరి) గడప గడప కార్యక్రమం నిర్వహించారు. చందంపేట, నేరేడుగొమ్ము మండలంలోని గిరిజన తండాల్లో పేరి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు బావోజి తెలిపారు. కార్యక్రమంలో గిరిజన మత పెద్దలు దాసానాయక్, డాక్యానాయక్, రఘుభగత్, జీవన్ భగత్, మంజ్యానాయక్, బుజ్జినాయక్, మకట్‌లాల్, లక్పతి, హరినాయక్, శంకర్‌నాయక్, దేవుజానాయక్, దావుడానాయక్ పాల్గొన్నారు.

మిర్యాలగూడ డీఎస్పీగా రాజశేఖర్‌రాజు

మిర్యాలగూడ, ఫిబ్రవరి 16: మిర్యాలగూడ డీఎస్పీగా కె.రాజశేఖర్‌రాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన డీఎస్పీ బి.వెంకటగిరిని ఉన్నతాధికారులు హైదరాబాద్‌కు బదిలీ చేశారు. రాజశేఖర్‌రాజు నిజామాబాద్ టాస్క్‌ఫోర్స్‌లో పనిచేసి మిర్యాలగూడకు బదిలీ వచ్చారు

పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల అందజేత

మిర్యాలగూడ, ఫిబ్రవరి 16: బంజారా మహిళా సొసైటీ డాక్టర్ ఆనంద్, హరిప్రియ సంయుక్తంగా శుక్రవారం మిర్యాలగూడలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 150 మంది బాలికలకు పరీక్ష ప్యాడ్‌లు అందించారు. కార్యక్రమంలో సుజాత, గోవింద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

30 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

శాలిగౌరారం, ఫిబ్రవరి 16 : అక్రమంగా నిల్వ చేసిన 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకొని శుక్రవారం సీజ్ చేసినట్లు డీటీసీఎస్ జ్యోతి తెలిపారు. వివిధ గ్రామాల్లో కొనుగోలు చేసి మాదారం గ్రామ శివారులో జీఎస్ఆర్ కోళ్ల ఫారంలో నిల్వ చేసిన బియ్యాన్ని పూర్తి సమాచారంతో పట్టుకొని సీజ్ చేసినట్లు, బియ్యాన్ని నకిరేకల్‌కు తరలించినట్లు ఆమె పేర్కొన్నారు.

అంతర్ రాష్ట్ర సెంట్రింగ్ మెటీరియల్ దొంగల ముఠా అరెస్ట్

- 4 లక్షల నగదు, 120 సెంట్రింగ్ ప్లేట్ల స్వాధీనం

దొంగల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

చిట్యాల, ఫిబ్రవరి 16 : ఇంటి నిర్మాణంలో ఉపయోగించే సెంట్రింగ్ మెటీరియల్‌ను దొంగిలించే అంతర్రాష్ట్ర దొంగల ముఠాను చిట్యాల ఎస్ఐ సైదబాబు ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 4 లక్షల నగదు, ట్రాలీ ఆటో, 120 సెంట్రింగ్ ప్లేట్లు, 2 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసుకు సంబంధించిన వివరాలను నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి స్థానిక సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం మర్లపాడు గ్రామానికి చెందిన సభావత్ సత్తయ్య, రామవత దేవలా, ఘనపురం గ్రామానికి చెందిన అంగోతు నీలావతి, చందంపేట మండలం చిత్రల బుద్దవణి తండాకు చెందిన కేతావత్ జానీ, కేతవత్ నాన్కు, దేవరకొండ మండలం షేర్‌పల్లి గ్రామానికి చెందిన రమావత్ పద్మతో మరో ముగ్గురు మైనర్లు గ్రూపుగా ఏర్పాడ్డారు. వీరు రాత్రి వేళల్లో గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్ల సెంట్రింగ్‌కు ఉపయోగించే ప్లేట్లను ఆటోలో లోడ్ చేసుకొని ఎత్తుకెళ్లారు. చిట్యాల మండలం వట్టిమర్తిలో చింతపల్లి నర్సింహ ఇంటి నిర్మాణం కోసం మెట్టు కృష్ణయ్య మేస్త్రీ సెంట్రింగ్ ప్లేట్లను నిల్వ ఉంచాడు. ఈ నెల 15న అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ ముఠా నర్సింహ ఇంటి వద్ద ఉన్న సెంట్రింగ్ ప్లేట్లను తమ ఆటోలో లోడ్ చేస్తుండగా శబ్దం వచ్చింది. దాంతో నర్సింహ ఇంటి బయటకు వచ్చి కేకలు వేయడంతో నేరస్తులు ఆటోతో పారిపోయే ప్రయత్నం చేశారు. నర్సింహ ఈ విషయాన్ని కృష్ణయ్యకు తెలియజేయగా ఆయనకు అక్కడకు వచ్చి చూడగా 120 సెంట్రింగ్ బాక్సులు దొంగిలించినట్లు గుర్తించాడు. ఈమేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దాంతో సీఐ నాగరాజుల పర్యవేక్షణలో ఎస్ఐ సైదబాబు శుక్రవారం చిట్యాలలోని రైల్వే స్టేషన్ క్రాసింగ్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా దుండగులు పోలీసులను చూసి తమ ఆటోను వదిలి పారిపోతుండడంతో పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. వారిని విచారించగా మోత్కూరు మండలం దత్తప్ప గూడెంలో 150 సెంట్రింగ్ ప్లేట్లు, అనా జీ పురంలో 17 సెంట్రింగ్ బాక్సులు, మో త్కూరులో 220 , చిట్యాల మండలం వెల్మినేడులో 180, రామన్నపేటలో 180, చిట్యాల మండలం వట్టిమర్తి స్టేజీ వద్ద 180,కట్టంగూరు మండలం అయిటిపాములలో కొన్ని సెంట్రింగ్ బాక్సులను దొంగిలించినట్లు ఒప్పుకున్నారు. చోరీ కేసును ఛేదించిన సీఐ, ఎస్ఐ, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

మున్సిపల్ కమిషనర్ల బాధ్యతల స్వీకరణ

నల్లగొండ, మిర్యాలగూడల్లో బాధ్యతలు స్వీకరిస్తున్న సయ్యద్ ముసాబ్ అహ్మద్, మహమ్మద్ యూసుఫ్

నీలగిరి, ఫిబ్రవరి 16 : నల్లగొండ మున్సిపల్ కమిషనర్‌గా సయ్యద్ ముసాబ్ అహ్మద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్‌ను నల్లగొండ మున్సిపల్ కమిషనర్‌గా, ఇక్కడ అదనపు కమిషనర్‌గా పనిచేస్తున్న సయ్యద్ ముసాబ్ అహ్మద్‌ను జిల్‌పల్లికి బదిలీ చేశారు. అనంతరం జరిగిన మార్పులు చేర్పుల్లో అదనపు కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్‌ను పూర్తికాలం కమిషనర్‌గా నియమించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా పుష్పగుచ్ఛం అందజేశారు.

మిర్యాలగూడ మున్సిపల్ కమిషనర్‌గా యూసుఫ్

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మున్సిపల్ కమిషనర్‌గా మహమ్మద్ యూసుఫ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం కమిషనర్‌గా పనిచేస్తున్న పూర్ణచందర్ వనపర్తికి బదిలీ చేశారు. గతంలో జీహెచ్ఎంసీలో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేసిన యూసుఫ్‌ను పాల్వంచకు బదిలీ చేసిన అధికారులు అనంతరం ఉత్తర్వులు మార్చి మిర్యాలగూడకు బదిలీ చేశారు.

భార్య ఆత్మహత్య కేసులో భర్తకు ఆరేండ్ల జైలు

మిర్యాలగూడ రూరల్, ఫిబ్రవరి 16 : భార్య ఆత్మహత్య కేసులో భర్తకు ఆరేండ్ల జైలు, రూ.2వేలు జరిమానా విధిస్తూ ఏడో అదనపు జిల్లా సెషన్ కోర్టు జడ్జి జి.వేణు శుక్రవారం తీర్పు చెప్పారు. రూరల్ ఎస్ఐ సతీశ్ వర్మ తెలిపిన వివరాల ప్రకారం మిర్యాలగూడ మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన గంధం బాలసైదులు, మణెమ్మ భార్యాభర్తలు. బాలసైదులు ఆటో డ్రైవర్‌గా జీవనం కొనసాగించాడు. భార్యకు వివాహేతర సంబంధాలు ఉన్నాయన్న అనుమానంతో భార్యను తీవ్రంగా వేధించడంతో తాళలేక డిసెంబర్ 28, 2016న ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్య చేసుకుంది. అప్పటి రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ బాలసైదులు పై వరకట్నం వేధింపు పై కేసు నమోదు చేశారు. నేరం నిరూపణ కావడంతో జడ్జి జైలు, జరిమానా విధించారు

లక్ష్మీనారాయణ స్వామి ఆలయ చైర్మన్‌గా వినోద్

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 16 : పట్టణంలోని లక్ష్మీనారాయణస్వామి దేవాలయ చైర్మన్‌గా అంకం వినోద్ ఎన్నికయ్యారు. ధర్మకర్తలుగా మోటి మహేశ్, చేరాల సుధీర్, ఏశాల మురళి, కూరపాటి బాబు, జోగు బుచ్చిబాబు, సకినాల నాగయ్య, గునిగంటి సుభాశ్, సైదుగాని రాములు, బత్తుల బాలాజీ, వంగూరి బాలకృష్ణ, పెద్దల ముత్యాలు, పొన్నమోని కావ్య, గోశిక శివకుమార్, జింకల కుమార్, ముషం శ్రీను, చెరుకు శ్రీకాంత్ ను ఎన్నుకున్నారు.

సేవాలాల్ జయంతి

రాజాపేట, ఫిబ్రవరి 16 : మండలంలోని పుట్టెగూడెంలో సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రాంజీనాయక్, విఠల్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్, దేవులానాయక్, బుడిగె పెంటయ్యగౌడ్ పాల్గొన్నారు.

కేసీఆర్ సర్కార్ నియామకాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చామని చెప్పకోవడం సిగ్గుచేటు

- బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్నా బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగార్జున

నల్లగొండ రూరల్, ఫిబ్రవరి 16: కేసీఆర్ పాలనలో చేపట్టిన ఉద్యోగాల నియామకాలకు కాంగ్రెస్ ప్రభుత్వం 27 వేల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పుకోవడం సిగ్గుచేటని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున విమర్శించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ మొదటి అసెంబ్లీ సమావేశాల్లో లక్షా ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఇచ్చిన మాట ప్రకారం లక్షా 65 వేల ఉద్యోగాలు ఆయా ప్రభుత్వ సంస్థల్లో నియమించారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం నిరుద్యోగులకు 5 వేలు నిరుద్యోగ భృతి, ఫిబ్రవరి 1వ తేదీకి ఇస్తామన్న గ్రూప్ –1 నోటిఫికేషన్, గురుకులాల్లో ఇంటర్మీడియట్, డిగ్రీ అధ్యాపకులకు తక్షణమే ఇంటర్వ్యూలు నిర్వహించి నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్వీ నాయకులు నోముల శంకర్, నర్సింహ, కిరణ్, రాకేశ్, గణేశ్, లింగస్వామి, నానియాదవ్, గజ్జి రాజు, రాజు పాల్గొన్నారు.

ఘనంగా సూర్యనారాయణ స్వామి కల్యాణం

ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు.

అడవిదేవులపల్లి, ఫిబ్రవరి 16: మండలంలోని కృష్ణానది శివారులో ఉన్న బౌద్ధమ దేవాలయాల్లో శుక్రవారం రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ స్వామి కల్యాణోత్సవాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవానికి సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వీక్షించి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎన్‌బీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నల్లమోతు సిద్ధార్థ, ఎంపీపీ ధనావత్ బాలాజీనాయక్, జడ్పీటీసీ సేవ్యానాయక్, వైస్ఎంపీపీ కూరాకుల మల్లీశ్వరీగోపినాథ్, తాసీల్దార్ సురేశ్ కుమార్, ఎంపీఓ లలితాసుబ్బారెడ్డి, ఎస్ఐ హరిబాబు పూజల్లో పాల్గొన్నారు.

దామరచర్ల ప్రమండల కేంద్రంలోని కోదండ రామాలయంలో సోమవారం రథసప్తమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆలయ ప్రాంగణంలో మహిళా భక్తులు రంగవల్లులు వేసి సూర్యదేవుడి ప్రతిమను పూలతో అలంకరించి సూర్యదేవుడికి శోడషోపచార పూజలు, అష్టోత్తర అర్చనలు నిర్వహించి, సూర్యనమస్కారాలు చేసి పాలతో వండిన పాయసాన్ని నివేదన చేశారు.

హాలియా : హాలియా వేంకటేశ్వర స్వామి ఆలయంలో సూర్యభగవానుడికి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేక అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు గోవర్ధన రాఘవాచార్యులు, భక్తులు నామిని సుధాకర్, రామలింగయ్య పాల్గొన్నారు.

బైక్‌ను ఢీ కొట్టిన కారు ఇద్దరు మృతి

మిర్యాలగూడ, ఫిబ్రవరి 16: మిర్యాలగూడ పట్టణంలోని అద్దంకి– నార్కట్‌పల్లి ప్రధాన రహదారిపై నందిపాడు కూడలిలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానికంగా అద్దంకి– నార్కట్‌పల్లి రహదారి పక్కన ఉన్న నవనీత వైన్స్ పక్కన పర్మిట్ రూమ్‌లో సప్లయర్స్‌గా పనిచేస్తున్న రుద్రాక్ష రాములు, మద్దెల శ్రీను రాత్రి విధులు ముగించుకొని బైక్‌పై పట్టణానికి వస్తున్నారు. నందిపాడు కూడలిలో రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టింది. ఈప్రమాదంలో వారు అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలకు శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. రుద్రాక్ష రాములు పట్టణంలోని శాంతినగర్ నివాసి. ఆయనకు భార్య విజయలక్ష్మి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. వైన్స్ సిట్టింగ్ రూమ్‌లో పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు.

కుటుంబ పెద్ద మరణంతో కటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు. మద్దెల శ్రీను కడప జిల్లా పులివెందుల నియోజకవర్గానికి చెందిన వ్యక్తి. ఇతడు వైన్స్ పర్మిట్ రూమ్‌లో పనిచేసుకుంటూ పట్టణంలోని బంగారుగడ్డలో నివాసం ఉంటున్నాడు.

తాయత్తు కడతామని చెప్పి పుస్తెలతాడు చోరీ

శాలిగౌరారం, ఫిబ్రవరి 16 : జ్యోతిష్యం చెబుతాం..తాయత్తు కట్టితే నరదిష్టి పోతుందని మాయమాటలతో వృద్ధురాలి మెడలో నుంచి పుస్తెల తాడుతో ఇద్దరు వ్యక్తులు పరాయ్యారు. శాలిగౌరారం ఎస్ఐ ఐలయ్య, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లాకు చెందిన ఇద్దరు యువకులు ఇటీవల మండలంలోని పలు గ్రామాల్లో సంచరిస్తూ జ్యోతిష్యం చెబుతాం, నరదిష్టి ఉన్న తొలగిస్తామని చెప్పుకుంటూ ఇండ్లలో తిరుగుతున్నారు.. ఈ క్రమంలో చిత్తలూర్ గ్రామానికి చెందిన తరాల సోమమ్మ ఇంటి కి మారయ్య అనే యువకుడు కాషాయ దుస్తులు ధరించి ఇంట్లోకి ప్రవేశించాడు. మీకు నరదిష్టి ఉందని, అది పోవాలంటే తాయత్తు కట్టాలని నమ్మబలికాడు. క్రమంలో వృద్ధురాలి మెడలో ఉన్న పుస్తెలతాడుకు తాయత్తు కడతానని చెప్పి తాడును తెంపుకొని ద్విచక్రవాహనంపై పరారయ్యారు. దాంతో వృద్ధురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మండలంలోని ఆకారం గ్రామంలో కూడా ఇలాగే జ్యోతి ష్యం చెబుతామంటూ మాయమాటలు చెబుతుండడంతో పసిగట్టిన గ్రామస్తులు పోలీస్‌లకు సమాచారం అందించారు. గ్రామానికి చేరుకున్న పోలీస్‌లు వారిని విచారిస్తున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

CHANGE OF NAME
MD FAIZ AHMAD S/O MD SHAIK AHMAD, Occupation: Business, Address: 3-114, Vallala, Shali Gowraram, Nalgonda, have changed my name to MOHAMMED FAIZ AHMED S/O MOHD SHAIK AHMED.

WANTED
★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-319440-All

INDUSIND BANK
COMMERCIAL VEHICLE FOR SALE
1. MAHINDRA ALFA DX DIESEL BS 6, TS29TB0791
2. PIAGGIO APE LTRA LDX BS-6 TS29TB1181
Cell No: 7337351819
D.No: 797, Bharath Reddy complex, Main Road, Kodad, Suryapet Dt -508206

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines, Extra Line - Extra Amount
5% GST అదనం

నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, (గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.

నల్లగొండ : 9182777626	నల్లగొండ : 9182777635	దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059	సూర్యాపేట : 9182777630	భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059	కోదాడ : 9182777196	చౌటుప్పల్ : 9182777638

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

నార్కట్‌పల్లి : కొత్తగూడెం పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు



చిట్యాల: వనిపాకల జడ్పీహెచ్ఎస్‌లో..

నార్కట్‌పల్లి ఫిబ్రవరి 16 : మండలంలోని కొత్తగూడెం మండల పరిషత్ పాఠశాలలో శుక్రవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, రాష్ట్ర మంత్రులుగా వివిధ పాత్రలను పోషించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ కూకుట్ల నర్సింహ హాజరయ్యారు. కార్యక్రమంలో ఓరుగంటి శ్రీనివాస్, భానుప్రకాశ్, ఆదిమల్ల మణిరాజు, వేణుగోపాల్ రావు, మౌనిక, సుకన్య పాల్గొన్నారు.

వనిపాకల జడ్పీహెచ్ఎస్‌లో..

చిట్యాల: వనిపాకల జడ్పీహెచ్ఎస్‌లో శుక్రవారం స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనయ్య, ఉపాధ్యాయులు దంతూరి సైదులు, గంపల రవీందర్‌రెడ్డి, మల్లేశం, సరిత, కరీం , శోభ మార్గదర్శకత్వంలో విద్యార్థులు తమ పాత్రల్లో రాణించారు.

చెన్నకేశవస్వామి రథోత్సవం

మాల్,ఫిబ్రవరి 16: చింతపల్లి మండలంలోని గొల్లపల్లి గ్రామంలో గల చెన్నకేశవ స్వామి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రథోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంకణాల వెంకట్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ నక్కనమోని ప్రేమలత, పరమేశ్ యాదవ్, శ్రీను, చిన్న మల్లేశ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

18న కొబ్బరికాయల వేలం

శాలిగౌరారం, ఫిబ్రవరి 16 : మండలంలోని బైరవునిబండ ఉమా మహేశ్వర, గంగా భవాని సమేత ఆలయ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం గ్రామం లో కొబ్బరికాయలు, లడ్డూ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ దండ యాదగిరిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు సకాలంలో హాజరై వేలం పాటను దక్కించుకోవాలన్నారు.

ఈ– వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన

ఈ– వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన కల్పిస్తున్న రిసోర్స్ పర్సన్ కార్తీకేశ్వరి

మిర్యాలగూడ, ఫిబ్రవరి 16: టీఎస్‌కేసీ టాస్క్ విభాగం ఆధ్వర్యంలో స్థానిక కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం ఈ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా టాస్క్ రిసోర్స్ పర్సన్ కార్తికేశ్వరి, ఎఫ్‌టీఎం శ్రావణిలు మాట్లాడుతూ ఈ వేస్ట్ మేనేజ్‌మెంట్ అవగాహన ప్రోగ్రాంలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించనున్నట్లు చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భిక్షమయ్య అధ్యక్షతన జరిగిన ఈ అవగాహన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.వెంకటరమణ, టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ డాక్టర్ జి. నాగయ్య, అధ్యాపకులు కోటయ్య, నరేందర్‌రెడ్డి, రమేశ్, రమణయ్య, వెంకన్న, హేము, సునంద, స్వప్న, రాణి పాల్గొన్నారు.